గ్రామాల్లో సమస్యల తిష్ట

- రోగాల బారిన పడుతున్న ప్రజలు
- ప్రత్యేక అధికారుల పాలనలో సమస్యలు మరింత జఠిలం


రాజనగర్ కాలనీలో ఇళ్ల చుట్టూ చేరిన మురికి


నందిపేటలోని వేంకటేశ్వరకాలనీలో పందులకు ఆవాసంగా మారిన మురికి కాలువ

నందిపేట్(ఆర్మూర్): రోజు రోజుకు గ్రామాల్లో సమస్యలు ఎక్కువవుతున్నాయి. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో మురికి కూపాలుగా మారుతున్నాయి. ప్రజాప్రతినిధుల పాలనలో నిర్లక్ష్యానికి గురైన సమస్యలు ప్రత్యేకాధికారుల పాలనలో మరింత జఠిలమయ్యాయి.

ఎక్కడి సమస్యలు అక్కడే..

గ్రామాలలో ప్రత్యేకాధికారుల పాలనలో సమస్యలు ఎక్కడికక్కడే ఉన్నాయి. మురికి కాల్వలను శుభ్రపరచడం, పిచ్చిమొక్కలను తొలగించడం, వీధులను ఊడ్చడం, నీటి ట్యాంకులను శుభ్రం చేయడం, తాగునీటి పైపులైన్ల లీకేజీలను సరిచేయడం లాంటి పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలి. ఈ పనులన్నీ చేపట్టేందుకు అవసరమైన నిధులు కొంత మేరకు ప్రభుత్వం సమకూర్చగా, మిగతావి పన్నుల రూపేణా వసూలు చేయాలి. కానీ గ్రామాలలో పన్నులు వసూలు కావడం లేదు. సమస్యలు పరిష్కరించడం లేదు.

మురికి కూపంలా కాలనీలు..

నందిపేట మండల కేంద్రంలోని పలు కాలనీల్లో ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారు. రాజనగర్ కాలనీలోని కెనాల్ కట్ట ప్రాంతంలో మురికి కాలువలు లేక రోడ్లపైనే మురుగు నీరు ప్రవహించి ఇళ్ల చుట్టూ మురికి గుంతలు ఏర్పడ్డాయి. గుంతలు పందులకు నిలయమై కాలనీవాసులు రోగాల బారిన పడుతున్నారు. డ్రైనేజీ వసతులు లేక తాగునీటి నల్లా పైపుల నుంచి వచ్చిన నీరు నిలిచిపోయి అపరిశుభ్రంగా మారుతున్నాయి. పాతూరులోని వేంకటేశ్వర కాలనీ అంధకారంతో చీకటిమయమైంది. తాగు నీటి వసతి లేక ప్రజలు అల్లాడిపోతున్నారు. పలు కాలనీల్లో డ్రైనేజీ వసతి లేక రోడ్లపైనే మురికి నీరు ప్రవహిస్తుంది. ప్రజాప్రతినిధుల పాలన ముగియగానే ప్రత్యేకాధికారులను ప్రభుత్వం నియమించగా సమస్యలు మరింత జఠిలమయ్యాయి.

రోగాల బారిన పడుతున్నాం

మా కాలనీలో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. ఇళ్ల చుట్టూ మురికి నీరు చేరడంతో పందులకు నిలయంగా మారింది. దోమల బెడద ఎక్కువవుతోంది. దీంతో రోగాల బారిన పడుతున్నాం. మా సమస్యలను అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవటం లేదు.

– శేఖర్‌రెడ్డి, రాజనగర్ కాలనీ, నందిపేట

సమస్యలతో సతమతమవుతున్నాం

కాలనీలో కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. సుమారు మూడేళ్ల నుంచి మా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులు, నాయకులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవటం లేదు. విద్యుత్ దీపాలు, తాగు నీరు, మురుగు కాలువలు లేక ఇబ్బంది పడుతున్నాం.

– మేకల శ్రీను, వేంకటేశ్వర కాలనీ, నందిపేట్

క్లుప్తంగా

మోర్తాడ్ వీడీసీ అధ్యక్షుడిగా జక్కం అశోక్



మోర్తాడ్: మోర్తాడ్ గ్రామాభివృద్ధి కమిటీ నూతన అధ్యక్షుడిగా జక్కం అశోక్ ఎంపికయ్యారు. మంగళవారం నిర్వహించిన నూతన కార్యవర్గ సభ్యుల సమావేశంలో కమిటీని ఎంపిక చేశారు. ఉపాధ్యక్షుడిగా నూతుల రాజేందర్, కోశాధికారిగా దడివె అశోక్, కార్యదర్శిగా పుప్పాల రాజ్ విఠల్, సంయుక్త కార్యదర్శిగా కడపటి రాజేశ్వర్, జాయింట్ చెక్‌పవర్ సభ్యుడిగా జక్కం పృథ్వీరాజ్, సలహాదారుడిగా దొమ్మాటి హరీష్ గౌడ్‌ను ఎంపిక చేశారు. ఉగాది రోజున పదవి బాధ్యతలను స్వీకరించి ఏడాదిపాటు కమిటీ పని చేయనుంది. నూతనంగా ఎంపికైన వీడీసీ ప్రతినిధులు వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేశారు.

'లక్ష్యాన్ని చేరుకున్నాం'

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో వసూలు చేయాల్సిన ఆస్తి పన్ను లక్ష్యాన్ని చేరుకున్నామని మున్సిపల్ కమిషనర్ రాజు తెలిపారు. డిమాండ్ రూ.5.7 కోట్లకు గాను సుమారు రూ.4.7 కోట్ల వరకు పన్ను వసూలు చేశామన్నారు. 80 శాతం పన్ను వసూలు చేసి జిల్లాలో మొదటి స్థానంలో ఉన్నామన్నారు. ఆస్తి పన్నులు చెల్లించని వారు త్వరగా చెల్లించి ఆర్మూర్ పట్టణ అభివృద్ధికి తోడ్పడాలన్నారు.

జాతీయ నేతల చిత్రపటాల బహూకరణ



వేల్పూర్: కుకునూర్ గ్రామానికి చెందిన సైన్స్ టీచర్ పఠాని సురేందర్ తమ గ్రామ ఉన్నత పాఠశాలకు మంగళవారం జాతీయ నాయకుల చిత్రపటాలు బహూకరించారు. దీంతో సురేందర్‌కు హెచ్‌ఎం టి.హరిచరణ్ కృతజ్ఞతలు తెలిపి, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కే.సాయిలు, వి.శ్రీధర్‌రావు, ఎం.మోహన్, జి.రవీందర్, జి.శ్రీనివాస్, డి.కృష్ణ, జి.అశోక్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పోలీస్ కళాజాత



కమ్మర్‌పల్లి: బషీరాబాద్‌లో నిజామాబాద్ పోలీస్ కళా బృందం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నిర్వహించిన పోలీస్ కళాజాత కార్యక్రమం గ్రామస్తులను విశేషంగా ఆకట్టుకుంది. వివిధ అంశాలపై నాటక ప్రదర్శనతో ప్రజలకు అర్థమయ్యే విధంగా వివరించారు. వేసవి సెలవుల్లో పిల్లలు ఈతకు వెళితే జరిగే అనర్థాలు, హెల్మెట్ ధరించకుండా వాహనం నడిపితే జరిగితే ప్రమాదాలు, డయల్ 100 వినియోగం, మొబైల్ ఫోన్ పోగొట్టుకుంటే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు, ఆన్‌లైన్‌లో జరిగే మోసాలను నాటిక ప్రదర్శనతో వివరించారు. ఎస్‌ఐ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటిజం జబ్బును నయం చేయవచ్చు

నిజామాబాద్‌నాగారం: చిన్నపిల్లల్లో తొలిదశలోనే ఆటిజం జబ్బును గుర్తిస్తే, వైద్యులను సంప్రదించి, మందులతో నయం చేయవచ్చని ఐఎంఏ ప్రధాన కార్యదర్శి కొట్టూరు శ్రీశైలం పేర్కొన్నారు. నగరంలోని ద్వారకానగర్‌లోని హెచ్‌పీఎస్ కిడ్స్ స్కూల్‌లో మంగళవారం ఆటిజం దినోత్సవం సందర్భంగా చిన్నపిల్లల్లో వచ్చే మానసిక రుగ్మతలపై ఆయన అవగాహన కల్పించారు. జబ్బులను నిర్లక్ష్యం చేయొద్దన్నారు. వైద్యులు రాజేంద్ర ప్రసాద్, నేతి బాలేష్, నవీన్‌రెడ్డి, చతుర, ప్రిన్సిపల్ ప్రసన్నలక్ష్మి, డైరెక్టర్ ప్రనయ్ పాల్గొన్నారు.

జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలి


మాట్లాడుతున్న విఘ్నేష్

ఆర్మూర్‌టౌన్: కేంద్రం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రాచకొండ విఘ్నేష్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని సీవీఆర్ కళాశాలలో మంగళవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆర్మూర్ 5వ డివిజన్ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని నాశనం చేస్తున్నాయని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యా శాఖకు ఇప్పటికైనా మంత్రిని నియమించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను సకాలంలో విడుదల చేయాలన్నారు. నూతన డివిజన్ కమిటీని 15 మందితో ఎన్నుకున్నామన్నారు. డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు జవహర్ సింగ్, సిద్ధుల నాగరాజు, ఉపాధ్యక్షులు ముత్యం, నటేష్, కిరణ్, అర్జున్, అజయ్, రమ్య, మమత పాల్గొన్నారు.

బాధితులను ఆర్థికంగా ఆదుకోవాలి


బాధిత కుటుంబాలతో మాట్లాడుతున్న నేతలు

ఆర్మూర్‌టౌన్: నిజాంసాగర్ కాలువ తెగిపోవడంతో నష్టపోయిన కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని, 25 ఏళ్లుగా నివాసముంటున్న వారికి పట్టాలు ఇవ్వాలని మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఆర్మూర్ పట్టణంలోని జర్నలిస్టు కాలనీలో సీపీఐ ఎంఎల్ ప్రజా పంథా పార్టీ ఆర్మూర్ సంయుక్త మండలాల కమిటీ ఆధ్వర్యంలో తెగిపోయిన నిజాంసాగర్ కాలువ కట్ట తెగిపోయిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసలు కాలువకు గండిపడి తెగిపోవడానికి ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యమే కారణమన్నారు. నష్టపోయిన వారికి రూ.20 వేలు చెల్లించి, ఇళ్లకు పట్టాలు ఇవ్వాలన్నారు. డివిజన్ కార్యదర్శి దేవారం, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ముత్తెన్న, పీడీఎస్‌యూ, ఏఐకేఎంఎస్, పీవోడబ్ల్యూ నాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జీవితంపై విద్యార్థులకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న తపస్ నాయకులు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ జీవితంలోని ప్రధాన ఘట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు రాజ్యాంగ రచనలో అంబేడ్కర్ పాత్ర, ఆయన జీవితంలోని ప్రధాన ఘట్టాలను వివరించారు.

కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, తపస్ ఆర్మూర్ మండల బాధ్యులు గంగాధర్, కిషన్ రెడ్డి, ఉపాధ్యాయులు రవి కుమార్, అనంత రావు, గంగారం, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి


సాలూర సొసైటీలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అసిస్టెంట్ రిజిస్ట్రార్ రవీందర్


హున్సాలో ప్రారంభిస్తున్న సీఈవో హన్మంత్‌రావు

బోధన్: రైతులకు మద్దతు ధర కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ రవీందర్ రైతులకు సూచించారు. మంగళవారం సాలూర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆవరణలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సీఈవో బస్వంత్‌రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ రిజిస్ట్రార్ రవీందర్ మాట్లాడుతూ.. వరి ధాన్యం క్వింటాలుకు ఏ-గ్రేడ్ రకం రూ.2,203, బి-గ్రేడ్ రకం రూ.2,183 ధరను ప్రభుత్వం ప్రకటించిందని వివరించారు. నిబంధనల మేరకు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకు రావాలని సూచించారు. సాలూర మండలంలోని హున్స సొసైటీలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సీఈవో హన్మంత్‌రావు ప్రారంభించారు.

మద్దతు ధర పొందాలి

రుద్రూర్: రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని తహసీల్దార్ వెంకటేశం సూచించారు. అక్బర్‌నగర్‌లో, మండల కేంద్రంలో స్థానిక సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ధాన్యాన్ని తక్కువ ధరకు విక్రయించి నష్టపోవద్దని, కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంబం(ఆర్)లో వ్యవసాయ విస్తర్ణాధికారి శ్రావణి, వర్ని మండలం తగిలేపల్లిలో సింగిల్ విండో సీఈవో లక్ష్మణ్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ప్రారంభించారు.

రెంజల్‌లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

రెంజల్(బోధన్): ఐకేపీ ఆధ్వర్యంలో దండిగుట్ట, బాగేపల్లి, నీలా గ్రామాల్లో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. గ్రామ సంఘాల ప్రతినిధులు, ఏపీఎం చిన్నయ్యలు సంయుక్తంగా కేంద్రాలను ప్రారంభించారు. రైతులు ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని ఏపీఎం కోరారు. మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు లక్ష్మి, సీసీలు భాస్కర్, రాజు, శ్యామల, కృష్ణ పాల్గొన్నారు.


రుద్రూర్‌లో ప్రారంభిస్తున్న తహసీల్దార్ వెంకటేశం


అంబం(ఆర్)లో ప్రారంభిస్తున్న ఏఈవో శ్రావణి


బాగేపల్లిలో..

అంగరంగ వైభవంగా విగ్రహాల ఊరేగింపు



మాక్లూర్: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన సీతారామాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం రాత్రి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై విగ్రహాలను విఠలేశ్వర దేవాలయం నుంచి ఊరేగిస్తూ నూతన ఆలయానికి చేర్చారు. వేదబ్రాహ్మణులు ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల 4న జగద్గురు శంకరాచార్య శ్రీ విద్యారణ్య భారతీస్వామి చేతుల మీదుగా విగ్రహ ప్రతిష్ఠాపన జరగనుంది.

సమాచారం..

నేడు సీనియర్ సిటిజన్స్ ఫోరం సర్వసభ్య సమావేశం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో సీనియర్ సిటిజన్స్ ఫోరం సర్వసభ్య సమావేశాన్ని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నామని ఆర్మూర్ డివిజన్ సీనియర్ సిటిజన్స్ ఫోరం అధ్యక్షుడు దొండి నారాయణ తెలిపారు. అలాగే సీనియర్ సిటిజన్స్‌లు పలు అంశాలపై చర్చించి తీర్మానాలు చేస్తారని, 60 ఏళ్లు పైబడిన ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

బోధన్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం(బోధన్ శాఖ) ఆధ్వర్యంలో ఈ నెల 4న పట్టణ కేంద్రంలోని తహసీల్ ఆఫీసు ఆవరణలో గల సంఘ భవనంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌రావు మంగళవారం తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. వైద్య పరీక్షలనంతరం అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్ చేస్తారని, హైదరాబాద్‌కు చెందిన మెడివిజన్ ఐ కేర్ సెంటర్ వైద్య బృందం శిబిరానికి వస్తుందని వివరించారు. విశ్రాంత ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరానికి వచ్చే వారు హెల్త్‌కార్డును వెంట తీసుకురావాలని సూచించారు.

పూర్తి కావచ్చిన పల్లె దవాఖానా భవనం

- త్వరగా వైద్య సేవలు ప్రారంభించాలని స్థానికుల వేడుకోలు



బాల్కొండ: మెండోరా మండలం సోన్‌పేట్‌లో నిర్మిస్తున్న పల్లె దవాఖానా పనులు ఎట్టకేలకు పూర్తి కావచ్చాయి. పల్లె దవాఖానా భవన నిర్మాణం కోసం గత ప్రభుత్వం రూ.20 లక్షల నిధులను మంజూరు చేసింది. గతేడాది ఫిబ్రవరిలో పనులకు శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఏడాది కాలంగా పనులు సాగుతూ.. ఆగుతూ ఎట్టకేలకు పూర్తి కావచ్చాయి. పనులను వెంటనే పూర్తి చేసి వైద్య సేవలను ప్రారంభించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రస్తుతం భవనం ప్లాస్టరింగ్ పనులు పూర్తయ్యాయి. వాటర్ పైపు లైన్, మరుగుదొడ్లు, మూత్రశాలల పైపు లైన్ పనులు, టైల్స్ పనులు చేపట్టవలసి ఉంది. పక్కన పోచంపాడ్‌లో పీహెచ్‌సీ ఉన్నప్పటికి కాకతీయ కాలువ అవతలి వైపు ఉండటం వల్ల వెళ్లడం అంత సులువు కాదు. జాతీయ రహదారి-44 నుంచి తిరిగి వెళ్లాలంటే ప్రజలకు దూరభారం అవుతుంది. వైద్య సేవలు సకాలంలో అందాలంటే భవన నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేసి సేవలను ప్రారంభించాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

పొగాకు బీట్ ప్రారంభం



రెంజల్(బోధన్): కందకుర్తి, బోర్గాం గ్రామాల్లో మంగళవారం పొగాకు కొనుగోలు కేంద్రాల(బీట్)ను వీఎస్‌టీ(వజీర్ సుల్తాన్ టొబాకో) ఏరియా మేనేజర్ క్రిష్టారావ్, కంపెనీ ఉపాధ్యక్షుడు అజయ్‌లు ప్రారంభించారు. క్వింటా పొగాకుకు రూ.13,800 ధర ప్రకటించడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. రైతులకు పెట్టుబడులు పెరగడంతో ధరను గతంలో కంటే అధికంగా పెంచినట్లు వివరించారు. కందకుర్తిలో రైతు, నీలా విండో చైర్మన్ ఇమాంబేగ్ కేంద్రాన్ని ప్రారంభించారు. బోర్గాంలో మాజీ సర్పంచ్ రమేష్‌తో కలిసి కంపెనీ ప్రతినిధులు ప్రారంభించారు. ఇతర కంపెనీలు అందించే మాయమాటలు నమ్మి రైతులు మోసపోవద్దని ఇమాంబేగ్ సూచించారు. గత 20 సంవత్సరాలుగా వీఎస్‌టీని నమ్ముకునే పొగాకును సాగు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



రెంజల్(బోధన్): బాగేపల్లిలో సీతారామ, హన్మాన్ ఆలయాల్లో గ్రామస్తులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్నారు. వేద బ్రహ్మణులు ఆలయాల్లో హోమం, యజ్ఞం నిర్వహించారు. గ్రామంలో నూతన ఆలయ నిర్మాణం చేపట్టి మండలం రోజులు పూర్తవడంతో అభిషేకాలు చేపట్టారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు సాయాగౌడ్, గోపాల్, దాత సాయిబాబా గౌడ్, మాజీ సర్పంచ్ సాయిలు, తదితరులున్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	గాడ్జిల్లా ఎక్స్ కాంగ్ (3డీ-తెలుగు) - 11.40, 2.20, 5.00, 7.40, 10.20
స్క్రీన్-2 –	టిల్లు స్క్వేర్ (తెలుగు) - 10.20, 1.20, 4.20, 7.20, 10.20
స్క్రీన్-3 –	ది గోట్ లైఫ్ (తెలుగు) - 11.05, 6.00, 9.40 రజాకార్-2.45
స్క్రీన్-4 –	క్రూ - 10.10, 4.10, 7.00, 10.10 ఓం భీమ్ బుష్ - 04.04

సంతలో సిండి'కేట్లు'

- బాల్కొండలో నిబంధనలకు విరుద్ధంగా తైబజార్ వేలం
- ప్రభుత్వం నిర్ణయించిన ధర కన్నా తక్కువ పాడిన వారికే కట్టబెట్టిన అధికారులు
- వెల్లువెత్తుతున్న విమర్శలు


బాల్కొండ జీపీలో వేలం వేస్తున్న అధికారులు (ఫైల్)

బాల్కొండ: వార సంతల్లో గుత్తేదార్లు సిండికేట్లుగా అవతారమెత్తుతున్నారు. కూటమి కట్టి అవగాహనతో వాటాలుగా తీసుకొని పంచాయతీల ఆదాయానికి భారీగా గండికొడుతున్నారు. గ్రామ పంచాయతీల పరిధిలోని తైబజార్(కూరగాయలు), గొర్రెలు, మేకలు, పశువుల వార సంతల నిర్వహణకు ప్రతి ఏడాది మార్చి నెలాఖరులో ప్రభుత్వ అనుమతితో నోటిఫికేషన్ జారీ చేసి బహిరంగ వేలం నిర్వహిస్తుంటారు. అయితే గుత్తేదార్లు ఇలా సిండికేట్‌గా ఏర్పడి ప్రభుత్వ ఆదాయాన్ని దోచుకుంటున్నారు. బాల్కొండ మండల కేంద్రంలో వారాంతపు సంత, రోజువారీ సంతలకు జీపీ ఆధ్వర్యంలో గత నెల 19న వేలం నిర్వహించారు. వేలంలో ప్రభుత్వ డిమాండ్ రూ.5 లక్షల 4 వేలు ఉంది. కాని అందరు సిండికేట్‌గా మారి రూ. 5.01 లక్షలకు ఒక వ్యాపారి దక్కించుకున్నారు. దీంతో ప్రభుత్వం నిర్ణయించిన ధర వేలం పాటలో రాకపోవడంతో వేలం పాటను వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. కాని వారం రోజులు గడవక ముందే మాట మార్చి ప్రస్తుతం గతంలో నిర్ణయించిన వేలం పాట ప్రకారం రూ.5.01 లక్షలకు దక్కించుకున్న వారికే అప్పగించాలని నిర్ణయించారు. దీంతో జీపీ ఆదాయానికి భారీ గండి ఏర్పడింది. వేలం పాట వాయిదా వేసిన అధికారులు మళ్లీ అదే ధరకు వారికే అప్పగించాలని నిర్ణయించడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాల్కొండ మండల కేంద్రంలో ప్రతి గురువారం పెద్ద సంత నిర్వహిస్తారు. రోజు వారీ సంత జోరుగా సాగుతుంది. ఇదంతా లెక్కించే ప్రభుత్వం తరుపున రూ.5 లక్షల 41 వేలు నిర్ణయించారు. కాని వేలం పాట పాడే వారు అందరు ఒక్కటై జీపీ ఆదాయానికి గండి కొట్టారు. ప్రతి సంవత్సరం ఇదేతంతు జరుగుతుంది. నిబంధనలకు విరుద్ధంగా వేలం నిర్వహించారు. ఉన్నతాధికారులు స్పందించి తైబజార్ వేలం పాటలపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

వారికే అప్పగించాలని సూచించారు

తైబజార్ వేలంలో దక్కించుకున్న వారికే అప్పగించాలని ఉన్నత అధికారులు సూచించారు. ప్రస్తుతం ఎంపీ ఎన్నికల కోడ్ కారణంగా మళ్లీ వేలం పాట నిర్వహించ వద్దన్నారు. రూ.5.01 లక్షలకు స్థానికుడు దక్కించుకున్నారు. ఉన్నత అధికారుల ఆదేశాలను పాటిస్తున్నాం.

– రజనీకాంత్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, బాల్కొండ

అపూర్వ సమ్మేళనం



మోర్తాడ్: తిమ్మాపూర్ ఉన్నత పాఠశాలలో 2004-05 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు మంగళవారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. 19 ఏళ్ల తర్వాత అందరూ ఒకే చోటుకు చేరడంతో సంతోషం వ్యక్తం చేశారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. సమ్మేళనంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.